నేటి దినపత్రిక
సూర్య
గురువారం 1 ఫిబ్రవరి 2024 పేజీలు 8
పల్నాడు జిల్లా



- సత్తెనపల్లి, నర్సరావుపేటపై జనసేన చూపు
- ఇప్పటికే 'ఆలపాటి' అలకతో పార్టీలో గందరగోళం..!
- పెదకూరపాడుకు భాష్యం ప్రవీణ్ పేరు పరిశీలన
- గురజాలకు ఎసరు పెట్టిన కొత్తగా చేరే ఎంపీ అభ్యర్థి
- తలనొప్పిగా మారిన టిడిపి అభ్యర్థుల కసరత్తు

నేటి దినపత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా

అభ్యర్థుల ఎంపిక విషయంలో అధికార పార్టీలో అలజడి రేగి ఎమ్మెల్యేలు, ఎంపిలు సైతం పార్టీలు మారుతోన్న నేపథ్యంలో తాజాగా టిడిపిలో కూడా ఇదే అభ్యర్థుల ఎంపికతో అలజడి మొదలైందన్న సమాచారం ఉంది. ఒక పార్టీలోనే అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొంటోన్న నేపథ్యంలో టిడిపి,జనసేన కలయికలో నియోజకవర్గాల ఎంపికలోనే డిష్యూం.. డిష్యూం అయ్యే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 175 నియోజకవర్గాలలో సుమారు 60 నియోజకవర్గాలు ఇవ్వాలని జనసేన అడుగుతున్నట్లు సమాచారం ఉంది. ఈ నేపథ్యంఅయలో ఉత్తరాంధ్రలోనే కాకుండా, తమకు బలం ఉన్న నియోజకవర్గాలలో ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి సీట్లు ఇవ్వాలని జనసేన కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే చెరి రెండు సీట్లను ప్రకటించిన నేపథ్యంలో తాము ఎక్కడ పోటీ చేయాలన్న దానిపై జనసేన ఇప్పటికే టిడిపి చెప్పినట్లు సమాచారం. సోషల్ మీడియాలో ఎక్కువగా జనసేన కోరుతున్న సీట్లను పరిగణలోకి తీసుకుంటే పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నేత నాదెండ్ల మనోహర్ తెనాలి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నాట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటి వరకు అక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న టిడిపి నేత

మిగతా 3వ పేజీలో

## జనసేన వేసిన కర్చీఫ్‌లతో..

# టీడీపీ ఇన్‌చార్జిలలో అలజడి



జగన్ ఎన్నికల తంత్రంతో

## మారుతోన్న రాజకీయం

### నరసరావుపేటఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్

- యాదవుల ఓట్లు 1.35 లక్షలు
- అసెంబ్లీ అభ్యర్థులు ఇక మారనట్లే
- ఇప్పటికే ఎమ్మెల్యేలకు సంకేతాలు ఇచ్చిన అధిష్టానం
- ప్రచార రంగంలోకి దిగాలని సూచన

3 లో



## ఎంపీ సీట్లపై

# టీడీపీలో అనిశ్చితి..!!

- రెండు ఎంపీ సీట్లు కమ్మకు ఇస్తే వ్యతిరేక పవనాలు
- నరసరావుపేటకు ఎంపి కోసం బీసీ వైపు చూస్తున్న టిడిపి అధినేత..?
- గుంటూరు ఎంపీ టిడిపి అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్ లేదా భాష్యం ప్రవీణ్

నేటి దినపత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా

ఎన్నికలు దగ్గర పడుతున్న కొలది రాజకీయాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 2024 ఎన్నికలే లక్ష్యంగా చేసుకొని బరిలోకి దిగుతున్న ప్రధాన పార్టీలు విజయం సాధించడానికి వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నాయి. వివిధ సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకొని అభ్యర్థులను రంగంలోకి దించుతున్నారు. ఆర్థిక, సామాజిక పరంగా బలమైన నేతలను ఎన్నికల బరిలోకి దించుతున్నాయి. అసెంబ్లీ అభ్యర్థులు ఎలా ఉన్నా.. వాటికి అనుకూలంగా ఎంపీ సీట్లను కూడా తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నాయి. ఇందులో భాగంగా అధికార వైసీపీ చేపట్టిన సామాజిక సమీకరణ దృక్పధాన్ని టిడిపి కూడా ఫాలో అవుతున్నట్లుగా కనిపిస్తోంది. వైసిపి దించిన అభ్యర్థులకు దీటుగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు పార్లమెంటు నియోజక వర్గాలు ఉన్నాయి. బాపట్ల లోక్ సభ స్థానం ఎస్సీ కాగా, గుంటూరు నరసరావుపేట స్థానాలు ఓసి కి ఉన్నాయి. గతంలో సామాజిక సమీకరణాలు బేరిజు వేసుకోకుండానే అభ్యర్థుల నిర్ణయించేవారు. నేడు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఎక్కువైన నేపథ్యంలో ఏదో ఒక సీటును బీసీకి కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. అధికార వైసిపి గుంటూరు ఎంపీగా కాపు సామాజిక వర్గం అభ్యర్థిని రంగంలో దించాలని భావించింది. నరసరావుపేట ఎంపీగా బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్

## తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి బ్రహ్మారెడ్డి



రెంటచింతల, మేజర్‌న్యూస్

తెలుగుదేశం విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అడుగులు ముందుకు వేయాలని మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రెంటచింతలలో టీడీపీ నేత మామిడి ఐజాక్ ఇంట జరిగిన వివాహ వేడుకలో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక నేతలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు పెచ్చరిల్లాయన్నారు. రాష్ట్రంలో సమర్థవంత పాలన తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో తెదేపాకు ప్రజలు ఘనవిజయం కట్టబెట్టి, వైకాపాను ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు ఇన్నర్ రింగు రోడ్డులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపదెబ్బ లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. సమావేశంలో అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి, రవి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి కోర్టులకు ఏజీపీ గా బాలి సైదా



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్ న్యూస్

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు (ఏ జి పి)గా సీనియర్ న్యాయవాది షేక్ బాలిసైదా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 16 సంవత్సరాలుగా సత్తెనపల్లి కోర్టులలో ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కాగా సీనియర్ న్యాయవాదులు ఇ.ఎల్లారెడ్డి, చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, రాజవరపు నరసింహారావు, పాటిబండ్ల రవి, చావా బాబురావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, నరిశేటి వేణుగోపాల్, ఏ.వి.కృష్ణారెడ్డి, బూతుకూరు రామిరెడ్డి, కంబాల అనిల్, షేక్ నాగుల, నాగూర్ బాబు జగన్మోహన్ రావు, వడియాల పాపారావు లు అభినందనలు తెలియజేశారు.

## నరసరావుపేట తెలుగుదేశం పార్టీలో చేరికలు



నరసరావుపేట, మేజర్‌న్యూస్

నరసరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు సమక్షంలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో కి చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ నేను ఉన్న నేను విన్నాను అంటూ జగన్ రెడ్డి మాయమాటలు చెప్పి మా అందరి ఓట్లతో అధికారంలోకి వచ్చారని అధికారంలోకి వచ్చాక పన్నుల పేరుతో మా సంపాదనను లూటీ చేశారని వారు వాపోయారు. జగన్ రెడ్డి లాంటి ఆర్థిక నేరగాన్ని నమ్మి మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీని గెలిపించి చేసిన తప్పును సరిదిద్దుకుంటామంటు భావోద్వేగానికి లోనయ్యారు. 2019 ఎన్నికల్లో జగన్ రెడ్డిని గెలిపించి మా సర్వం కోల్పోయామని 2024లో చంద్రబాబును గెలిపించి జగన్ రెడ్డి చేసిన మోసానికి పగ తీర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, కుంపటి రవి, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు కమిషన్ సభ్యులు బి.పద్మావతి






నరసరావుపేట, మేజర్‌న్యూస్

నేటి బాలలే రేపటి పౌరులని , వారి శ్రేయస్సు కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో ఉన్న పద్మావతి ఉదయం కలెక్టరేట్ స్పందన కార్యాలయంలో జిల్లాలోని కేజీబివి ప్రిన్సిపాల్స్,మోడల్ స్కూళ్లు, గురు కుల పాఠశాల, రాష్ట్ర సాంఘిక సంక్షేమ, బి.సి,ట్రైబల్ వెల్ఫేర్,వసతి గృహాల వార్డెన్లు, విద్యాశాఖ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి, పోలీస్ శాఖాధికారులు, రోడ్డు రవాణా సంస్థ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు,జిల్లా బాలల సంరక్షణ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా విభాగాల్లో అమలౌతున్న బాలల హక్కులు,వారి సంక్షేమానికి చేపడుతున్న చర్యలుపై పూర్తి సమాచా రాన్ని రాబట్టి ప్రయత్నం చేశారు, సంబంధిత లెక్కలు,నివేదికలపై చర్చించారు. అనంతరం ఆయా విభాగాధిపతులు, ఉన్నతాధికారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనలు జరుపుతోందని అన్నారు,ఎక్కడ బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడతారో అక్కడ ప్రత్యక్షంగా,పరోక్షంగా తనదైన శైలిలో అడుగులు వేస్తుందని అన్నారు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బం దిపై దేగ కళ్ళతో గమనించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు,అంతిమంగా బాలల హక్కుల, పరిరక్షణ లో రాజీ లేని సేవలే ఏకైక లక్ష్యంగా కర్తవ్య నిర్వహణలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం బాలల హక్కుల అమలు జరపాలని, తద్వారా బాలల భవిష్యత్తులో ఉన్నత స్థాయి కి ఎదగాలని, విద్య ద్వారా నే సామాజిక న్యాయం పిల్లలకు అందుతుందని , సమానత్వం సాధ్యం అన్నారు. డ్రాప్ అవుట్స్ , ఇ రెగ్యులర్ విద్యార్థులు మీద ప్రత్యేక దృష్టి సారించా లని, చైల్డ్ మ్యారేజెస్ ని క్షేత్రస్థాయిలో నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నట్లు, మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి విద్యార్థులకు మహిళా సంరక్షణ కార్యదర్శి ల ద్వారా జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు ఐసిడిఎస్ మరియు పోలీసుల ద్వారా రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అనంతరం డిఆర్ఓ వినాయక మాట్లాడుతూ కలెక్టర్ ప్రారంభించిన బంగారు తల్లి కార్యక్రమం వల్ల లో గ్రేట్ లో ఉన్న హెచ్ బి లెవెల్స్ నార్మల్గా తీసుకురావడానికి ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని రూపొందించి దీనిద్వారా ఆడపిల్లలు మగపిల్లలు అనే లింగ సమానత్వం సాధించాలని దిశగా అడుగులు వేస్తుందన్నారు. మేడం ఆకస్మిక తనిఖీ ద్వారా గమనించిన లోపాలను సవరించుకొని యాక్ట్ ప్రకారం సంరక్షణ చర్యలు పిల్లలకు సంబంధించినటువంటివి చేపట్టాలని అందరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ కేజీబీవీ మోడల్ స్కూల్స్ గవర్నమెంట్ స్కూల్స్ ప్రైవేట్ స్కూల్స్ రెగ్యులర్ స్టూడెంట్స్ ని బడికి రానటువంటి పిల్లలను గుర్తించి మళ్లీ బడిలోకి చేర్పిస్తున్నామని నూరు శాతం పదవ తరగతిలో అక్షరాస్యత సాధించే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నామని క్షేత్రస్థాయిలో మంచి స్పర్శ చెడు స్పర్శ కార్యక్రమం ద్వారా ఎంఎస్కేలు ద్వారా అవగాహన సదస్సులు ప్రైవేట్ స్కూల్స్ గవర్నమెంట్ పాఠశాలలు కూడా ఎంఈఓ లు హెల్త్ డిపార్ట్మెంట్ ఐసిడిఎస్ పోలీసుల సహకారంతో రక్షణ సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు .కంప్లైంట్స్ మీద బేస్ చేసుకుని సర్వీస్ నుండి తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున అందరూ ఒకరికొకరు సహకరించి కొన్ని పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చే విధంగా స్నేహపూరిత ఆంధ్రప్రదేశ్గా రూపుదిద్దుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి యమ్ హెచ్ ఓ , ఐ సి డి ఎస్ పి డి ఉమా రాణి జి సి డి ఓ రేవతి, గురుకుల డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ సిడిపిఓలు ఎంఈఓ లు, కేజీబీవీ ప్రిన్సిపల్స్ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్ లు గురుకుల ప్రిన్సిపల్లు ఏపీ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ లు సోషల్ వెల్ఫేర్ డ్రైవర్ వెల్ఫేర్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎస్ డబ్ల్యూ ఓ హాస్టల్ వార్డెన్స్ ఐపిఎస్ పిఓ ఎల్పిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## తాహశీల్దార్ ఆక్రమణపై విచారణ చేయాలి



గురజాల, మేజర్‌న్యూస్

గురజాల తాహసిల్దార్ మీసాల దానియేలు చేస్తున్న ఆక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీవో రమణ కాంత్ రెడ్డికి బిజెపి నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో గురజాల మండల పరిధిలోని పోరంబోకు, గ్రామకంఠం, అసైన్డ్ భూములు, కుంట భూములు కొందరు నాయకులకు తన స్వప్రయోజనాల కోసం నగదు తీసుకొని పట్టాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రైతులకు సంబంధించిన పొలం పాస్ బుక్కుల విషయంలో లక్షలు వసూలు చేస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తహసిల్దార్ పై విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

## టీడీపీని వీడి వైసీపీలో చేరిక



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్

మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన 10 టిడిపి కుటుంబాలు వారు టీడీపీ పార్టీని వీడి బుధవారం వైసీపీలోకి చేరారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, పల్నాడు జిల్లా వై.యస్.ఆర్.సి.పి అధ్యక్షులు, మాచర్ల శాసనసభ్యులు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, వెంకటరామయ్య తదితరులు ఉన్నారు.

## పల్నాడు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధిగా కొక్కెర గంగాధర్



నరసరావుపేట, మేజర్‌న్యూస్

పల్నాడు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధిగా నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన కొక్కెర గంగాధర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం ఈ మేరకు నియామక పత్రాన్ని నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ చదరవాడ అరవింద్ బాబు అందించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విజయానికి తన సర్వస్వం ఒడ్డు తానని ఒక సైనికుడిగా వైసీపీ అరాచకాల పై విరామం ఎరుగని పోరాటం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి తెలుగుదేశం పార్టీ పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తుందని పార్టీ పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని గంగాధర్ కు సూచించారు. కష్ట పడి పని చేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొస్తే భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని అరవింద బాబు గంగాధర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్,కొల్లి బ్రహ్మయ్య,మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు,దాసరి నరసింహారావు,దుర్గా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 22 నుంచి 26వ తేదీ వరకు

## ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై గ్లోబల్ సమ్మిట్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై 'ఇండియావుడ్ 2024' ఫిబ్రవరి 22 నుంచి 26వ తేదీ వరకు జరగనుంది. ఇది ఇండియా వుడ్ 13వ ఎడిషన్. ఈ ప్రదర్శనలో 950 పైగా కంపెనీలు, 50 పైగా దేశాల నుంచి 75 వేలకు పైగా వాణిజ్య సందర్శకులు విచ్చేయనున్నారు. ఇది 75 వేల స్క్వేర్ మీటర్ల ఎగ్జిబిషన్ ప్రాంతం. ఈ ఈవెంట్ తాజా ఆవిష్కరణలు, సాంకేతికతపై ఒక అవగాహన అందిస్తుంది. ఎన్నో నెట్‌వర్కింగ్ అవకాశాలను కూడా అందిస్తుంది. ఇండియా వుడ్ 2024 అనేది ఈవెంట్ చరిత్రలో అతిపెద్దది. ప్రపంచంలో ఉన్న పరిశ్రమ నాయకులు, సాంకేతికత సరఫరాదారులు, కొనుగోలుదారులను ఒకచోట చేర్చుతుంది. ఇది నిపుణులు, ఆలోచనా నాయకుల నేతృత్వంలోని సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చల సమగ్ర లైనప్‌ను కలిగి ఉంది. అత్యాధునిక మెషినరీ, టెక్నాలజీ, మెటీరియల్స్, సామాగ్రి, ఫిట్టింగ్‌లు, హార్డ్‌వేర్, కాంపోనెంట్‌లు, పరిశ్రమ సేవలు కలవు.

## జనసేన వేసిన కర్చీప్‌లతో.. టిడిపి ఇన్‌ఛార్జులలో అలజడి..!!

(మొదటి పేజీ తరువాయి)

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సీటు లేకుండా పోయింది. అయితే ఆలపాటిని గుంటూరు 2 ఇవ్వనున్నట్లుగా ముందుగా ప్రచారం జరిగింది. ఇక్కడ కూడా జనసేన నేత బోయినబోయిన శ్రీనావాసరావుకు ఇవ్వాలని పట్టు పడుతున్నట్లుగా సమాచారం అందులోంది. చివరకు పెదకూరపాగు నియోజకవర్గంను ఇ్వఆలని చూసిన అక్కడ భాష్యం విద్యాసంస్థల అఇనేత భాష్యం ప్రవీన్‌కు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం అందులోంది. దీంతో ఆలపాటి అధిష్టానంపై అలక వహించినట్లుగా సమాచారం అందుతోంది. ఇదిలావుండగా, పల్నాడు జిల్లాలోని మరో రెండు నియోజకవర్గాలపై జనసేన కన్నేసినట్లు సమాచారం అందుతోంది. నర్సరావుపేట అసెంబ్లీ స్థానం తోపాటుగా సత్తెనపల్లి స్థానంను కూడా జనసేనకు కేటాయించాలని పట్టుపడుతునన్నటుల్గఆ తెలుస్తోంది. దీంతో జిల్లాలో టిడిపి అభ్యర్థులు విషయంలో గందరగోళం నెలకొనే అవకాశం ఎక్కఉవగా కనిపిస్తోంది.కాగా, ఇప్పటి వరకు టిడిపి ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, నర్సరావుపేట ఇన్‌చార్జిగా ఉన్న అరవిందబాబు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఎదయిస్తోంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో టిడిపి అనుకున్న ప్రకారంగా చూస్తే తెనాలి మినహా జనసేనకు ఎక్కడ కూడా ఇవ్వాలని టిడిపి భావించడంలేదు. అవసరమైతే మరో జిల్లాలో అవకాశం ఇస్తాం కాని రాజధాని జిల్లా గా ఉన్న గుంటూరు, కృష్ణా జిల్లాలో మాత్రం జనసేనకు ఒక్కొక్కటి మాత్రమే ఇవ్వనున్నట్లు సమాచారం అందులోంది. అయితే టిడిపి భావాలకు జనసేన సహకరిస్తుందా..? ఒక సీటుగా జిల్లాలో పరిమితం అవుతుందా..అన్న శ్న ఉదయిస్తోంది.ఇదిలావుండగా, జిల్లాలో మేము కోరుకున్న సీట్లు ఇ్వని పక్షంలో టిడిపికి సహకరించేది లేదని ఇప్పటికే కొందరు జనసేన నాయకులు నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు.

### కొత్తగా చేరే పార్టీలో చేరాలనుకునే నేతల డిమాండ్స్ :

అధికార వైసిపిలో సీట్ల విషయంలో గందరగోళం నెఅఉలకొనటమేకాకుండా వారిని ఇతర సెగ్మెంట్లకు వెళ్ళాలని ఆదేశించిన అధిష్టానం నిర్ణయం రుచించని అనేక మంది నేతలు టిడిపి చేరాలని భావించుకున్నట్లు సమాచారం అందుతోంది.ఇందులో భగాంగా ఇటీవల వైసిపి గుడ్‌బై చెప్పిన నేత తాను గుంటూరుకు ఎంపి టిక్కెట్‌కు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తుంది. అయితే తమరు నర్సరావుపేటకు ప్రాతినిధ్యం వహించాలని అధినేత చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. యఅఇతే తాను ఒకటీ రెండు అసెంబ్లీ సీట్లు నేను కోరిన వారికి ఇవ్వాలని అడిగినట్లుగా తెలుస్తోంది. ఈనేపథ్యంలో తాను గుంటూరు ఎంపిగా పోటీ చేస్తే గుంటూరు2 ఇవ్వాలని, నర్సరావుపేట నుంచి పోటీ చేస్తే గురజాల అసెంబ్లీ ఇవ్వాలని కోరినట్లుగా సమాచారం ఉంది. అయితే గురజాలలో స్ట్రాంగ్ గా ఉన్న యరపతినేనిని కాదని ఇతరులకు ఇచ్చే అవకాశం ఉంటుందా అన్న చరఋ నియోజవకవర్గంలో జరుగతోంది. ఈవిషయంపై తర్జన భర్జన జరుగతున్నట్లు తెలుస్తోంది.మొత్తం మీద టిడిపి అభ్యర్థులు కసరత్తు విషయంలో ఇంత గందరగోళంగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటన జరిగిన తరువాత ఏ పరిణాలు జరుగతాయోనన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

## విపత్తు నిర్వహణ సంస్థ నూతన డైరెక్టర్‌గా కూర్మనాథ్

**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో బుధవారం నూతన డైరెక్టర్ గా 2016 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీ రోణంకి కూర్మనాథ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. విపత్తుల్లో ఎప్పటికప్పుడు తీసుకునే చర్యలు, హెచ్చరికలు జారీచేసే కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి ఈడి నాగరాజు వివరించారు.



### జగన్ ఎన్నికల తంత్రంతో

# మారుతోన్న రాజకీయం

**నేటి దినపత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా**

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో వైసిపి అధినేత వినూత్న పందాను చేపట్టారు. ఒకవైపు ప్రచార రంగంలో దూసుకెళుతూనే మరోవైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో కూడా స్పీడ్ పెంచారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్యక్షంగా పరోక్షంగా అభ్యర్థులు ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. పైకి ప్రకటించకపోయినప్పటికీ నర్మగర్భంగా సిట్టింగులనే కొనసాగించాలన్న నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఎంత ఉత్కంఠ గా ఎదురు చూసిన నరసరావుపేట ఎంపీ స్థానాన్ని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు వైసిపి అధిష్టానం వెల్లడించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 నియోజకవర్గాలు ఉంటే, పల్నాడు జిల్లా పైన ఎక్కువగా ఫోకస్ పెట్టిన ముఖ్యమంత్రి జగన్ అనుకున్న విధంగానే మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టారు. వివిధ సర్వేల ద్వారా వచ్చిన ర్యాంకులను ఆదరణ చేసుకొని ఒక్క చిలకలూరిపేట మినహా, మీరు నా ఆరు అసెంబ్లీ నియోజకవర్గం మార్చనట్లే కనిపిస్తోంది. నరసరావుపేట నియోజకవర్గం ఏర్పడిన తర్వాత పార్లమెంట్ అభ్యర్థిత్వానికి బీసీ అభ్యర్థిని దించటం ఇదే తొలిసారి. దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అనిల్ కుమార్ యాదవ్ ను గెలిపించుకోవాలని బీసీలు పంతం పట్టినట్లుగా సమాచారం. యాదవ సామాజిక వర్గం ఓట్లు ఈ నియోజకవర్గంలో సుమారు లక్షన్నర ఉండవచ్చునని ప్రాథమిక అంచనాగా ఉంది. యాదవులు ఏ పార్టీలో ఉన్నా తమ సామాజిక వర్గానికి ఏ పార్టీ అయితే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తుందో వారికి మద్దతు ఇవ్వాలని కూడా నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల జరిగిన బీసీ సామాజిక సైతం యాత్రలో కూడా ఇదే అంశాన్ని చర్చించినట్లుగా సమాచారం. ఇటీవల జరిగిన అనేక పరిణామాలు బీసీలకు రాజకీయ ప్రాణదానంతో కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 2019లో చిలకలూరిపేట నియోజకవర్గానికి బీసీ అభ్యర్థిని కేటాయించిన వైసిపి ఇప్పుడు ఏకంగా ఎంపీకే బీసీ అభ్యర్థిని ఖరారు చేయడం పట్ల హర్షం వ్యక్తం అవుతుంది.

**ప్రచార రంగంలోకి దూకండి**

అభ్యర్థులను ఖరారు చేసాం... ఇక ప్రచార రంగంలోకి దూకాలని వైసిపి అధిష్టానం పార్టీ శ్రేణులను ఆదేశించింది. ఇప్పటికే ఆసరా పథకం పరంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతున్నారు. సచివాలయాల పరిధిలో డ్వాక్రా సంఘాలను ఒక తాటిపై తీసుకువచ్చి వారికి ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్నారు. ఎక్కడ ప్రతిపక్షాలకు తావు లేకుండా ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు.

## ఆడుదాం-ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని స్థానిక స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిర్వహించే "ఆడుదాం-ఆంధ్ర" జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం జిల్లా కలెక్టర్ శివశంకర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ వాలీబాల్, క్రికెట్, కోకో, కబాడీ, సెటిల్ బెట్ మెంటన్ ఆటలను సచివాలయ గ్రామస్థాయి నుండి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి ముఖ్యమంత్రి



చేతుల మీదుగా బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆటలాడేందుకు ఆట పరికరాలు మండల, జిల్లా స్థాయి గెలుపొందిన వారికి బహుమతులు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం పంపించి ఉన్నారని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ద్వారా పలు ఆటలలో ప్రావీణ్యం ఉన్నవారు ప్రోత్సహించబడతారని శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తారని మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ పాఠశాల పీడీలు మరియు నరసరావుపేట మండల నాయకులు, ఎంపీపీ, వైస్-ఎంపీపీ, జడ్పిటిసి, మండల కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ గృహసారధులు, సోషల్ మీడియా కన్వీనర్లు, జగనన్న అభిమానులు మరియు వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ సీట్లపై టీడీపీలో అనిచ్చితి...!?

(మొదటి పేజీ తరువాయి)

రంగంలోకి దించింది. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో యాదవ్ సామాజిక వర్గం ఓట్లు సుమారు లక్షన్నర ఉండవచ్చని భావిస్తున్నారు. దీనికి తోడు ఇతర బీసీ వర్గాలు కూడా వైసిపికి అనుకూలంగానే ఉన్నాయి. అదేవిధంగా ఎస్సీ సామాజిక వర్గం సామాజిక వర్గం ఓట్లు, రెడ్డి సామాజిక వర్గం ఓట్లు వైసిపి 80% వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో నరసరావుపేటకు కమ్మ సామాజిక వర్గం అభ్యర్థిని రంగంలోకి దించితే గెలుపు ఓటమిలో వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని టిడిపి అధినేత భావిస్తున్నట్లుగా సమాచారం అందుతుంది. అందుకు అనుగుణంగా వైసిపికి దీటుగా అభ్యర్థులను దించాలని భావిస్తున్న నేపథ్యంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన పారిశ్రామికవేత్త, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్లుగా సమాచారం అందుతుంది. ఆయన కాని పక్షంలో ఆయన కుమారుడు పుట్ట మహేష్ యాదవ్ వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన నరసరావుపేట సిట్టింగ్ ఎంపీ కృష్ణదేవరాయలు ఒకవేళ టిడిపిలో చేరితే, నరసరావుపేట లేదా గుంటూరులో బరిలో నిలుపుతారా అనే అంశంపై అనిచ్ఛితి కొనసాగుతోంది. ఈ విషయంలో అధినేత చంద్రబాబు నాయుడు మరో పది రోజులు వేచి చూసే ధోరణిలో ఉండాలని నిర్ణయించు కున్నట్లు సమాచారం అందుతోంది. ఈ విషయాన్ని శ్రీకృష్ణదేవరాయలు కూడా తెలియజేసినట్లు పుకార్లు వ్యాపించాయి. అయితే, సిట్టింగ్ ఎంపీ కృష్ణదేవరాయలు తాను పలనాడు నుంచే పోటీ చేస్తానని ప్రకటించిన విషయం కూడా విధితమే.

**గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్**

గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఎన్నారై, కమ్మ సామాజిక వర్గానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ పేరును పరిశీలిస్తున్నట్లుగా సమాచారం అందు తుంది. అదేవిధంగా భాష రామకృష్ణ పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. భాష్యం ప్రవీణ్ పేరు పరిశీలిస్తున్నప్పటికీ ఆయనకు పెద్దకూరపాడు స్థానం ఇచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**రెండు కమ్మ సామాజిక వర్గానికి ఇస్తే వ్యతిరేక పవనాలు..!**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న రెండు ఎంపీ సీట్లకు కమ్మ సామాజిక వర్గాలను రంగంలోకి దించితే ఇతర సామాజిక వర్గాల్లో వ్యతిరేకతపరికే అవకాశం ఉందని టిడిపి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నరసరావుపేటకు బీసీ అభ్యర్థిని రంగంలోకి దించి, గుంటూరుకు కమ్మ సామాజిక వర్గాన్ని రంగంలోకి తీసుకురావాలన్న యువజన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ విధంగా చేస్తే సామాజిక వర్గాల పరంగా సమతుల్యత పాటించనులుగా ఉంటుందని, వాటి పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గం కైవసం చేసుకునే అవకాశం ఉందని కూడా టిడిపి అధిష్టాన భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో నరసరావుపేట ఎంపీ స్థానానికి బీసీ అభ్యర్థన రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లుగా సమాచారం అందుతుంది.

## రికార్డ్ స్థాయిలో పలికిన దేవరంపాడు చేపల చెరువు వేలం పాట...!!

### 33 లక్షల, 52 వేలకు కైవసం చేసుకున్న "రంగారావు"





రాజుపాలెం, మేజర్‌న్యూస్

మండలంలోని దేవరంపాడు గ్రామానికి చెందిన 80 ఎకరాల చేపల చెరువు వేలంపాటలో రికార్డు స్థాయి 33 లక్షల 52,000 కు అదే గ్రామానికి చెందిన రామ్ రంగారావు పాడుకున్నారు. బుధవారం నరసరావుపేట డి ఎల్ పి ఓ రమణయ్య ఆధ్వర్యంలో చేపల చెరువు వేలంపాట నిర్వహించారు. నిబంధన ప్రకారం రెండు సంవత్సరాలకు ఈ పాట నిర్వహిస్తున్నామని, వేలంపాట పాడదలచిన వారు 50 వేల రూపాయలు డిపాజిట్ చేయాలని, పాట అనంతరం పాడిన వారికి తప్ప మిగిలిన వారి డిపాజిట్ తిరిగి ఇవ్వబడుతుందని, అదేవిధంగా పాడుకున్న వ్యక్తి రెండు రోజుల్లో వన్ ఫోర్త్ అమౌంట్ చెల్లించాలని, మిగిలిన అమౌంట్ ఏడు రోజుల్లో చెల్లించాలని డిఎల్పిఓ రమణయ్య తెలిపారు. పాట మొదలు కాగా పోటాపోటీగా వేలం పాట జరిగి 33 లక్షల 52 వేల రూపాయలకు అదే గ్రామానికి చెందిన రామ్ రంగారావు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీనమ్మ, దేవరంపాడు గుడి చైర్మన్ శామకూరి శ్రీనివాసరావు, ఇఓపిఆర్డి పగడాల ముక్కంటి, పంచాయతీ సెక్రెటరీ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



- రాష్ట్రంలో మహిళా సంక్షేమ విప్లవం
- వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ
- మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

## మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం: ఎమ్మెల్యే కాసు

గురజాల, మేజర్‌న్యూస్

రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో బుధవారం 4,5,6,8 వార్డ్ లలో వైయస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమ్యూనిటీ హాల్ లను ప్రారంభించారు. అలాగే సిసి రోడ్లు డ్రైన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, నవరత్నాల పేరుతో ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందనీ అన్నారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేస్తే.... జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్క గురజాల నగర పంచాయతీ పరిధిలోనే 10 కోట్ల 22 లక్షల రూపాయల డబ్బు నేరుగా మహిళల ఖాతాలో అందజేశామని తెలిపారు. రానున్న ఆరు నెలల కాలంలో ప్రతి ఇంటికి మంచినీరు అందింస్తామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని.... మిగిలిన పనులను రానున్న రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్ మై వీరారెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కౌన్సిలర్లు బండి రవి, సుభాని, నాయకులు చల్లా కాశి బాబు, జక్కా సత్యం, కనకం ఆదినారాయణ దత్తు, పోలా సతీష్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.







## పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

పిడుగురాళ్ళ, మేజర్‌న్యూస్

పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. పట్టణంలోని సంజీవరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని నెమలి రెడ్డి బజార్ 1 సచివాలయం లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్ , వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవ రెడ్డి, మాదాల కిరణ్ కుమార్, పలువురు వైసిపి నాయకులు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చిందన్నారు. దీనిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తద్వారా రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాలలో స్థానిక వైద్యులతో పాటు ప్రత్యేక విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొంటారని అన్నారు. వైద్య శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చునన్నారు. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా సుమారు 50 లక్షలకు పైగా ప్రజలు వైద్య సేవలు పొందారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్యం సురక్ష 2.0 కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆ సచివాలయ పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకుని ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పొందవచ్చు అన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉన్నత ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని, అక్కడ వారికి ఉచితంగా పరీక్షలు, శస్త్ర చికిత్సలతో పాటు మందులను పంపిణీ చేస్తారు అన్నారు. సంజీవరెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నవ్వులూరి అమరేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 307 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి కృష్ణారావు బజార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పి. అనిల్ కుమార్, నరములు ఎముకల వైద్య నిపుణులు సుశీల్ కుమార్, గుండె సంబంధిత వైద్యులు. సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## నియంత, రాక్షస పరిపాలన నుండి విముక్తి కల్పిద్దాం.. రండి...!!







సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

పల్నాడు జిల్లా, సత్తెనపల్లి నియోజకవర్గం, ముప్పాళ్ళ మం డలం, దమ్మాలపాడు గ్రామంలో "బాబు షూరిటీ - భవి ష్యత్తుకి గ్యారెంటీ" కార్యక్రమం మంగళవారం రాత్రి జరి గింది. మాజీ మంత్రి, సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ నియో జకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పా రావు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దమ్మాల పాడు గ్రామంలోని ప్రధాన కూడలిలో మహిళలు హారతు లుతో వారికి ఘన స్వాగతం పలికారు. "కన్నా" గ్రామం లోని ప్రతి ఇంటికి వెళ్లి "మినీ మేనిఫెస్టో లోని" అంశాల ను ప్రజలకు వివరించి వాటికి సంబంధించిన కరపత్రా లను పంపిణీ చేశారు. కన్నా మాట్లాడుతూ.. రాష్ట్రానికి, నియో జకవర్గానికి నియంత, రాక్షస పరిపాలన నుండి విముక్తి కల్పిద్దాం అని పిలుపునిచ్చారు. మహిళా శక్తి పేరుతో ప్రకటించిన పథకం ద్వారా మహిళా సాధికారత చేకూర్చ డం, తల్లికి వందనం కింద బిడ్డలను చదివిం చుకునేం దుకు ఒక్కొక్కరికి 15000 ఇవ్వనున్నారని, ఆర్టీసీ బస్సుల్లో ఆడపడుచులకు ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిం చనున్నారని, సాగు భారమై రైతన్నల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారికి అండగా ఉండేందుకు సంవ త్సరానికి 20వేల రూపాయలు ఆర్థిక సాయం చేస్తామని, 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, నిరు ద్యోగ భృతి కింద నెలకు 3000 రూపా యలు ఇస్తామని, వెనుకబడిన తరగతుల వర్గాల వారికి దళితులకు ప్రత్యేక రక్షణ చట్టం రూపొందిస్తామని తెలియజేశారు. చంద్ర బాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సమక్షంలో ఇంకా సం క్షేమ అభివృద్ధి పథకాలు శ్రీకారం చుడతారని దమ్మాల పాడు గ్రామంలోని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు సిరిగిరి శ్రీనివా సరావు, కోమ్మిశెట్టి సాంబశివరావు, డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, దమ్మాలపాడు గ్రామ సర్పంచి కుమ్మరి ఏడుకొండలు, తెదేపా నాయకులు సిరిగిరి వెంకట్రావు, ఎంపీటీసీ రామారావు, దేశం పార్టీ మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరి పవన్, నియోజకవర్గ తెలుగుదేశం - జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి:ఎమ్మెల్యే కాసు

-మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్
-అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే కాసు
- నాయకురాలు నాగమ్మ దూబచెరువు ప్రారంభోత్సవం
-వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
-పాల్గొన్న ఎమ్మెల్సీ ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీ.జి.వి.కృష్ణారెడ్డి






గురజాల, మేజర్‌న్యూస్: ప్రతి వర్గానికి మంచి చేసిన ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి కోరారు. గురజాల పట్టణంలో మూడు కోట్ల రూపాయల వ్యయంతో సుందరంగా అభివృద్ధి చేసిన నాయకురాలు నాగమ్మ దూబాచెరువును, పల్నాడు బ్రహ్మనాయుడు, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీ.జీ.వీ.కృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ముందుగా దుబాచెరువు ప్రారంభించి, ఐ లవ్ గురజాల స్టాట్యూ, పిల్లల ఆట స్థలం, ఓపెన్ జిమ్ ప్రారంభించారు. చెరువు ఆవరణలో వైయస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. బ్రహ్మనాయుడు కూడలి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ధైర్యంగా ఓట్లు అడుగుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. గతంలో ఎన్నడు లేని విధంగా గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని, కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. దూబచెరువును సుందరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్ మై వీరారెడ్డిని ఆయన అభినందించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడు లేని విధంగా గురజాల నియోజకవర్గం అభివృద్ధి చేసిన శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డికి ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్ మై వీరారెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కౌన్సిలర్లు బండి రవి, సుభాని, నాయకులు చల్లా కాశి బాబు, జక్కా సత్యం,దత్తు, పోలా సతీష్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## రోడ్ ప్రమాదంలో భారీగా గంజాయి స్వాధీనం



యడ్లపాడు, మేజర్‌న్యూస్: మండలం లోని తిమ్మాపురం 16వ నెంబర్ జాతీయ రహదారి పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిషేధిత గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా సీలేరు నుండి తెలంగాణ రాష్ట్రానికి రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు యువకులు సుమారు 100 కేజీల గంజాయి ట్రావెలింగ్ బ్యాగులలో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు తిమ్మాపురం సెంటర్లో రెండు బైకులు ఒకదానికి ఒకటి గుద్దుకుని క్రింద పడిపోవటంతో స్థానికులు గుర్తించి హైవే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బైకులు తోపాటు యువకులను, వారు అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 100 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది చిలకలూరిపేట రూరల్ సిఐ పి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నాదెండ్ల ఎస్సైబలరామరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.



# వైకాపా జెండా, జగన్ బొమ్మ పెట్టుకుని ప్రజల ముందుకు వెళ్లడానికి ఎవరికీ మొహం చెల్లడం లేదు

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు
వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలతోనే తెదేపాలోకి వలసలు.
వైకాపా నుంచి భారీగా తెదేపాలోకి కొనసాగుతున్న వలసలు



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో అధికార వైకాపా, ప్రజావ్యతిరేక విధానాలు, ఒంటెత్తు పోకడలతో విసుగుచెంది తెలుగుదేశం పార్టీలోకి భారీస్థాయిలో వలసలు పోటెత్తుతున్నారు అని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెలుగుదేశం పార్టీ - జనసేన గేట్లు పూర్తిగా తెరిస్తే వైకాపా మొత్తం రోజుల వ్యవధిలో ఖాళీ కావడం ఖాయమన్నారు. వైకాపా జెండా, జగన్ బొమ్మ పెట్టుకుని ప్రజల ముందుకు వెళ్లడానికి ఎవరికీ మొహం చెల్లడం లేదని ఎద్దేవా చేశారు. బుధవారం పట్టణ పురపాలక సంఘం పరిధిలోని 37వ వార్డుకు చెందిన మహిళలు, యువకులు వైకాపాని వీడి తెదేపాలో చేరారు. క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు వేసి ప్రత్తిపాటి పుల్లారావు ఆహ్వానించారు. వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న మోసపూరిత విధానాలకు విసుగుచెంది తెదేపాలో చేరినట్లు వారంతా తెలిపారు. ఈసందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ వైకాపా పతనానికి నాందిగా తెదేపాలోకి అనేక మంది చేరుతున్నారని అన్నారు. ఐప్యాక్‌తో వైకాపా చేయించుకుంటున్న సొంత సర్వేల్లోనూ వరసగా జగన్‌కు ప్రతికూల ఫలితాలే వస్తున్నాయన్నారు. ప్రతి సర్వేలో వైకాపా ఓటమి తప్పదని తెలుతున్న తరుణంలో మునిగిపోయే నావలా మారిన ఆ పార్టీలో ఎవరు మాత్రం కొనసాగాలని కోరుకుంటారు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ప్రజల జీవన స్థితిగతులను అథఃపాతాళానికి పడేసిన చేతగాని నాయకుడు జగన్ అని ధ్వజమెత్తారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు సమకూర్చలేని చేతకాని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో తెదేపా-జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యం ఇస్తామని ప్రత్తిపాటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో రైతులే శాస్త్రవేత్తలు:కె. అమలకుమారి

నరసరావుపేట మేజర్ న్యూస్: పల్నాడు జిలాలో రైతు శాస్త్రవేత్తలకు నాలుగు సంవత్సరాల రైతు శిక్షణ తరగతులలో భాగంగా రెండవ సెమిస్టర్ కోర్స్ నరసరావుపేట లోని అంజిరెడ్డి మీటింగ్ హాల్లో నిర్వహించారు. డీపీఎం కె.అమల కుమారి మొదటి సంవత్సరం లోని రెండు సెమిస్టర్లులో జరిగే రైతు శాస్త్రవేత్తల సొంత పొలాల్లో వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ మోడల్స్ , సాఫ్ట్ స్కిల్స్ మరియు ఆగ్రోఏకాజీ మాడ్యూల్స్ గురించి రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు . అలాగే, పల్నాడు జిల్లాలోని అమలు అవుతున్న మెరుగైన ప్రకృతి వ్యవసాయ మోడల్స్ మరియు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న నిరంతరం ఆదాయం ఇచ్చే ఏటీఎం మరియు కరువుని తట్టుకొని పండించిన డ్రౌట్ ప్రూఫ్ మోడల్ యొక్క రైతుల విజయగాథల గురించి శిక్షణ పొందుతున్న




రైతు శాస్త్రవేత్తలకు తెలియజేయబడింది. ఈ తరగతి శిక్షకులు టి పి పి రమ్య, డి పి పి భాషా మరియు భవాని రాజ్ పాల్గొనడం జరిగింది.

## మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా వెంకట దాసు



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్: మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా వెంకట దాసు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటిదాకా కమిషనర్‌గా పనిచేసిన రమణబాబు బుచ్చిరెడ్డిపాలెం కమిషనర్ గా వెళ్లారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట దాసుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్

పిడుగురాళ్ల టౌన్, మేజర్‌న్యూస్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు రెండవ శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కమ్ జూనియర్ సివిల్ జడ్జి యం. మురళి గంగాధరరావు నేడొక ప్రకటనలో తెలియజేసినారు. కావున పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు,చెక్ బౌన్స్ కేసులను, కుటుంబ తగాదాలు,ప్రీ లిటిగేషన్ కేసులు ( ముందస్తు వ్యాజ్యములను) తదితర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము, ధనము ఆదా అవుతుంది అని తెలియజేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఉదయం నుండి సాయంత్రం వరకు జాతీయలోక్ అదాలత్ జరుగును. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సినదిగా తెలిపారు.

## మృతి చెందిన వాలంటీర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్:

మాచర్ల మండలం పసువేముల గ్రామానికి చెందిన వాలంటీర్ పండ్ల శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ప్రభుత్వ విప్ మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వాలంటీర్ పండ్ల శ్రీనివాస్ కుటుంబానికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాలంటీర్ శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని అన్నారు.

## వీధి బాలల పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి: జూపల్లి శ్రీనివాసరావు



మాచర్ల, మేజర్‌న్యూస్

బుధవారం వీధి బాలల దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవా కమిటీ మాచర్ల వారి ఆధ్వర్యంలో పట్టణంలో గల రామకృష్ణ సేవాసమితి ఆశ్రమంలో వీధి బాలలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాది జూపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ వీధి బాలల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, యాచక వృత్తిని ప్రోత్సహించవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్య ఆశ్రమ సౌకర్యాలను వినియోగించుకొని ప్రభుత్వ ఆశ్రమం పాఠశాలలో చేర్పించినట్లయితే వారు మంచి ఉద్యోగులుగా మారి భవిష్యత్తులో దేశానికి ఎంతో సేవ చేసే అవకాశం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరు బాధ్యత వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వై రమేష్ బాబు మండల న్యాయ సేవ కమిటీ సభ్యులు మెట్ట గోవింద రెడ్డి పాల్గొన్నారు.

## మాచర్ల మున్సిపల్ కమిషనర్ గా వెంకట దాసు

మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్:



మాచర్ల మున్సిపల్ కమిషనర్ గా వెంకట దాసు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తూ మాచర్ల మున్సిపల్ కమిషనర్ గా వచ్చారు. ఇప్పటిదాకా కమిషనర్ గా పనిచేసిన రమణబాబు బుచ్చిరెడ్డిపాలెం కమిషనర్ గా వెళ్లారు. కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన వెంకట దాసుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే: డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, మేజర్‌న్యూస్

తెలుగుదేశం నరసరావుపేట మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నరసరావుపేట మండలం తెలుగుదేశం నాయకులకు "బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ" కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకోవడం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు,రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను, "బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ" పేరిట ప్రజలలోకి విస్తృతంగా తీసుకుపోవాలని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని దా??చదల వాడ అరవింద బాబు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని తెలుగుదేశం పార్టీ గుర్తు పెట్టుకుంటుందని టీడీపీ అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం అంకితభావం తో పని చేసిన ప్రతి ఒక్కరిని పదవులతో గౌరవిస్తామన్నారు. క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్- చార్జీలు ఎన్నికలకు సిద్ధం కావాలని దొంగ ఓట్ల తొలగింపుకు,కొత్త ఓట్ల చేర్పు ప్రక్రియను వేగవంతం చేయాలని అరవిం ద బాబు పిలుపునిచ్చారు.రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆంధ్ర రాష్ట్రానికి కాబోయే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడని తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త వ్యూహకర్తలుగా తయ్యారు కావాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశేశ్వర్ రావు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొడ్డపాటి పెరయ్య,పులిమి రామిరెడ్డి,మాజీ మండల అధ్యక్షులు గంగుల పెద్దిరెడ్డి,పునాటి శ్రీనివాస్ రావు మరియు క్లస్టర్ ఇన్-చార్జిలు,యూనిట్ ఇన్-చార్జిలు,బూత్ ఇన్-చార్జిలు పాల్గొన్నారు.

# సంఘం డైరీ పాల కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు సరికాదు

నరసరావుపేట, మేజర్‌న్యూస్



పల్నాడు జిల్లాలోని నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో నల్ల గార్లపాడు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 17ను సంఘం డైరీ పాల కేంద్రంలో కొనసాగించటం ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు విరుద్ధమని సంఘం డైరీ పాల కేంద్రం తెలుగుదేశం పార్టీ నేత తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర దని సంగం డైరీ పాల కేంద్రానికి చైర్మన్గా దూళిపాళ్ల నరేంద్ర వ్యవహరిస్తున్నారని రమేష్ కుమార్ తెలిపారు. తక్షణమే అక్కడనుండి పోలింగ్ స్టేషన్ రైతు భరోసా కేంద్రంలోకి మార్చాలని పల్నాడు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి కే వినాయకం ను మరియు నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి ఎం శేషిరెడ్డిని వివిధ రాజకీయ పార్టీల సమావేశంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఫిర్యాదు పైతెలిపారు తక్షణమే చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి కే.వినాయకం మరియు నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి శేషిరెడ్డిని తెలిపారు.

## బంగారు పతకం సాధించిన బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థిని



విజయపురిసౌత్, మేజర్ న్యూస్

స్థానిక డాక్టర్ బిఆర్అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థిని భ్యూలా భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో గెలుపొంది బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ మేరి మంజుల బుధవారం తెలిపారు. బంగారు పతకం సాధించిన భ్యూలా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన భ్యూలాను,బ్రాంజ్ మెడల్ సాధించిన ఎన్. అనిత,సర్టిఫికెట్లను సాధించిన విద్యార్థినులను,ప్రిన్సిపాల్ మేరి మంజుల,పీడీ మహబూబి,పీఈటీ నసీమ, ఉపాధ్యాయినులు అభినందించారు.

# పిడుగురాళ్లలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



పిడుగురాళ్ల టౌన్, మేజర్‌న్యూస్

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పట్టణంలోని ప్రచారంలో భాగంగా నిర్వహించే 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' వాహనం ద్వారా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారంలో భాగంగా నిర్వహించే 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పట్టణంలోనే జానపాడు రోడ్డులో లాంఛనంగా ప్రారంభించి నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్ మాట్లాడుతూ ఉజ్వల గ్యాస్ కనెక్షన్స్, ప్రధాన మంత్రి అవస యోజన గ్రామీణ పట్టన సొంత ఇంటి కళ, పట్టాన ప్రజలకు మంచినీటి కుళాయి కనెక్షన్స్ , సాధికారిక మహిళలకు భరోసా, ఆయుష్మాన్ భరత్ ద్వారా 5 లక్షల భీమా, రైతు సంక్షేమ భరోసా ఇలా ఎన్నో పథకాలు మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు చేపట్టిన కార్యక్రమాలను ప్రజలోకి తిసుకెళ్ళడం జరుగుతుందన్నారు. పి ఎల్ ఎఫ్ ఆర్ పి మాగ గంగ మాట్లాడుతూ..ఆరోగ్య భారతం దిశగా ప్రధాని దార్శనిక కృషిలో చౌక, సౌలభ్య ఆరోగ్య సంరక్షణ ఒక మూలస్తంభం. ఈ దిశగా చేపట్టిన కీలక కార్యక్రమాల్లో పేద, మధ్యతరగతి వర్గాలకు సరసమైన ధరతో మందులు లభించేలా జనౌషధి కేంద్రాల స్థాపనలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో జానపాడు రోడ్డులో ఒకటి వుందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సాగర్, బిజెపి నాయకులు ఏలూరు శశి కుమార్, వడ్లమూడి వెంకయ్య చౌదరి, హనుమంతరావు తదితర బిజెపినాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం




**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూ తేదీలు**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ 2023 పోస్టులకు ఇంటర్వ్యూ తేదీలను యూపీఎస్సీ విడుదల చేసింది. ఫేజ్–2 కింద ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 15 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. 2023 డిసెంబర్‌లో ఫేజ్–1 జాబితా వెలువడిన సంగతి తెలిసిందే. ఫేజ్ 2 జాబితాలో అభ్యర్థుల రోల్ నంబర్, ఇంటర్వ్యూ తేదీ, సమయం వివరాలను యూపీఎస్సీ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఇ–సమన్ లెటర్లు త్వరలో వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు కమిషన్ ప్రకటించింది.

**తెలంగాణ కామన్ ఎంట్రెన్స్ టెస్టుల తేదీలు**

2024–25 విద్యాసంవత్సరానికి కామన్ ఎంట్రెన్స్ టెస్టుల తేదీలను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఉమ్మడి ప్రవేశ పరీక్షలు మేలో ప్రారంభం అవుతాయి. మే 9 నుంచి 11 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ కోర్సులకు ఎంట్రెన్స్ పరీక్ష జరుగనున్నది. మే 12, 13 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ప్రవేశ పరీక్ష జేఎన్టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరుగనున్నది. ఈసెట్ ప్రవేశ పరీక్ష ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మే 6వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. బీఈడీ కోర్సులో ప్రవేశం కోసం ఉద్దేశించిన టీఎస్ ఎడ్ సెట్ పరీక్ష మే 23న జరుగుతుంది.

టీఎస్ లా సెట్ ఎంట్రన్స్ టెస్ట్ జూన్ 3న జరుగనుండగా, లాసెట్, పీజీ ఎల్‌సెట్‌లను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. ఐసెట్ ప్రవేశ పరీక్ష జూన్ 4, 5 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ నిర్వహణలో జరుగుతుంది. ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పీజీఈసెట్ పరీక్ష జూన్ 6 నుంచి 8 తేదీల మధ్యలో నిర్వహించనున్నారు. హైదరాబాద్ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఈ కామన్ ఎంట్రెన్స్ టెస్టులు జరగనున్నాయి. బీపీఎడ్, డీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీఈసెట్ పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీల మధ్యలో నిర్వహిస్తారు. ఈ ఎంట్రెన్స్ టెస్టును శాతవాహన యూనివర్సిటీ నిర్వహిస్తుంది.

**ఏపీ టెట్- 2024 నోటిఫికేషన్**

త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోన్న నేపథ్యంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు విద్యాశాఖ మార్గ దర్శకాలు జారీ చేసింది. 2022, 2023 సంవత్సరాల్లో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన వారికి కూడా త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో టెట్ నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2022 ఆగస్టులో చివరిసారిగా టెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నాడు టెట్‌కు దాదాపు 4.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా దాదాపు 2 లక్షల మంది అర్హత సాధించారు. ఈసారి సుమారు 5 లక్షల మంది టెట్ రాసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. త్వరలో టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

**పేపర్-1, పేపర్ 2 అర్హతల సవరణ..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాసేందుకు అర్హతలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి నుంచి 5 తరగతులకు బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు నిర్వహించే టెట్–1 పేపర్ పరీక్ష, ఆరు నుంచి పదో తరగతి వరకు బోధించేందుకు నిర్వహించే పేపర్ 2 పరీక్షకు హాజరయ్యేందుకు అర్హతలను సవరించింది. రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (DELED), నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (BELED) చేసిన వారు మాత్రమే పేపర్ 1 పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొంది. ఇంటర్మీడియట్, తత్సమాన విద్యార్హతలో ఓసీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన పెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 5 శాతం మినహాయింపు నిచ్చి, 45 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని పేర్కొంది. బీఈడీ చేసిన వారు కూడా ఎస్జీటీ పోస్టులకు అర్హులేనంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసినందున ఈ సవరణ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. టెట్ పరీక్ష నిర్వహణ వ్యయాన్ని కూడా అభ్యర్థుల దరఖాస్తు ఫీజుల నుంచే భరించాలని ఈ సందర్భంగా సూచించింది.

టెట్ పేపర్ – 2 కు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో అర్హత మార్కులను 40 శాతానికి కుదించారు. అయితే ఈ ఒక్కసారికి మాత్రమే ఈ మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

**డిగ్రీ కాలేజీల్లో కొత్తగా మరో 50 పోస్టులు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో గతేడాది డిసెంబర్ 30న 240 లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తాజా ఈ పోస్టుల సంఖ్యను పెంచుతూ ఏపీపీఎస్సీ ప్రకటన వెలువరించింది. కొత్తగా మరో 50 పోస్టులను కలిపింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 290కి చేరింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అయ్యింది. సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్/ స్లెట్/ సెట్ ఉత్తీర్ణులై ఉండాలి. అర్హులైన అభ్యర్థులు జనవరి 24వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల వయో పరిమితి 2023 జులై 1 నాటికి 42 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ కేటగిరీకి చెందినవారికి మూడేళ్లు చొప్పున వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

అభ్యర్థులు దరఖాస్తు రుసుం కింద రూ.250తో పాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ/ఎస్టీ/బీసీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మెన్, తెల్లరేషన్ కార్డు కలిగిన మహిళలకు ప్రాసెసింగ్ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. మిగతా అందరూ రూ.370 లు అప్లికేషన్ ఫీజు కింద చెల్లించాలి. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష ఏప్రిల్/ మే, 2024లో ఉంటుంది.



**పరీక్ష విధానం**

డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటుంది. మొత్తం 450 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు పేపర్లకు పరీక్ష ఉంటుంది. పేపర్- 1 150 ప్రశ్నలకు 150 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ (డిగ్రీ స్టాండర్డ్) నుంచి ప్రశ్నలు అడుగుతారు.150 నిమిషాల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. పేపర్- 2 పరీక్ష అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టుపై ఉంటుంది. 150 ప్రశ్నలకు 300 మార్కులకు 150 నిమిషాల్లో పరీక్ష పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 నెగెటివ్ మార్కు ఉంటుంది.

**తెలంగాణ స్టాఫ్‌నర్సు పోస్టుల తుది జాబితా విడుదల**

తెలంగాణ స్టాఫ్ నర్సుల పోస్టులకు ఎంపికైన వారి తుది జాబితాను రాష్ట్ర వైద్య, ఆరోగ్యసేవల రిక్రూట్‌మెంట్ బోర్డు జనవరి 28 ప్రకటించింది. వైద్య, ఆరోగ్యశాఖలో మొత్తం తొమ్మిది విభాగాల్లో 6,956 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు స్టాఫ్‌నర్సుల మెరిట్ జాబితాను రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ) పరిధిలోని వివిధ ఆసుపత్రులు, గురుకులాల్లో స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దాదాపు 40 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. వీరందరికీ గత ఏడాది ఆగస్టు 2న రాతపరీక్ష నిర్వహించారు. రిజర్వేషన్, జోన్లవారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలతోపాటు, కటాఫ్ ర్యాంకులు, మార్కుల వివరాలను కూడా బోర్డు వెల్లడించింది. కొత్తగా ఎంపికైన స్టాఫ్‌నర్స్‌లకు జవవరి 31న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నారు.

**ఎన్‌పీసీఐఎల్‌లో పోస్టుల భర్తీ**

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. వివరాలు..

స్టయిఫండరీ ట్రెయినీ/ సైంటిఫిక్ అసిస్టెంట్ మొత్తం ఖాళీలు: 53

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిజిక్స్ తదితరాలు

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో

చివరితేదీ: ఫిబ్రవరి 14,2024.

వివరాలకు వెబ్‌సైట్: https://www.npcilcareers.co.in

**డీఆర్‌డీవోలో జేఆర్‌ఎఫ్ పోస్టులు**

డీఆర్‌డీవో పరిధిలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై ఆల్టిట్యూడ్ రీసెర్చ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

పోస్టులు: జేఆర్‌ఎఫ్, రీసెర్చ్ అసోసియేట్

మొత్తం ఖాళీలు: 14

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 15,2024.

వెబ్‌సైట్: https://drdo.gov.in

**హెచ్‌సీఎల్‌లో ఇంజినీర్ ట్రెయినీ పోస్టులు**

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)లో గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

మొత్తం ఖాళీలు: 40

అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత. గేట్ స్కోర్ ఉండాలి.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో

చివరితేదీ: ఫిబ్రవరి 19, 2024.

వెబ్‌సైట్: https://www.hindustancopper. com

**ఎన్‌సీఈఆర్‌టీఈలో 170 ఉద్యోగాలు**

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీఈ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

మొత్తం ఖాళీలు: 170

పోస్టులు: అసిస్టెంట్ ఎడిటర్, ప్రూఫ్ రీడర్, డీటీపీ ఆపరేటర్.

అర్హతలు: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 1 నుంచి 3 మధ్య

వెబ్‌సైట్: https://ncert.nic.in

**యూపీఎస్సీలో 121 స్పెషలిస్ట్, సైంటిస్ట్ పోస్టులు**

అసిస్టెంట్ ఇండస్ట్రియల్ అడ్వైజర్, సైంటిస్ట్–బి, అసిస్టెంట్ జువాలజిస్ట్, స్పెషలిస్ట్ గ్రేడ్–III తదితర పోస్టుల భర్తీకీ భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ఎంపిక ఉంటుంది.

మొత్తం పోస్టులు : 121

అర్హతలు : పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 35 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక : రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.25

దరఖాస్తు : ఆన్‌లైన్‌లో

చివరి తేది: ఫిబ్రవరి 01,2024.

వెబ్‌సైట్ : https://www.upsc.gov.in/

**న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో 300 పోస్టులు**

300 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి భారత ప్రభుత్వ పరిధిలోని ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో

వయస్సు: 21–30 ఏళ్ల మధ్య ఉండాలి.

చివరితేదీ: ఫిబ్రవరి 15,2024.

వెబ్‌సైట్: https://www.newindia.co.in

**భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 361 పోస్టులు**

వివిధ విభాగాలలో 361 పోస్టుల భర్తీకి భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ, డిప్లొమా ఇన్ పీజీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి. అర్హతలు గల అభ్యర్థులు ఫిబ్రవరి 17, 18, 21, 22, 25వ తేదీలలో ఇంటర్వ్యూకి హాజరు కావోచ్చు.

పోస్టులు : ప్రాజెక్ట్ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్

విభాగాలు : మానవ వనరుల విభాగం, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్ తదితరాలు

పని ప్రదేశం : హైదరాబాద్, బెంగళూరు, భానూర్, విశాఖపట్నం, కొచ్చి, ముంబయి

వయస్సు : 28 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక : అకడమిక్ మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు ఫీజు : ప్రాజెక్ట్ ఇంజినీర్/ ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులలకు రూ.300. ఇతర పోస్టులకు రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్‌ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

దరఖాస్తు : ఆన్‌లైన్‌లో

ఇంటర్వ్యూ తేదీలు:

ఫిబ్రవరి 17, 21, 25 తేదీల్లో నిర్వహిస్తారు

వేదిక: బీడీఎల్ కంచన్‌బాగ్ (హైదరాబాద్), బీడీఎల్ భానూర్ (సంగారెడ్డి), బీడీఎల్ విశాఖపట్నం యూనిట్.

వెబ్‌సైట్ : www.bdl-india.in

# సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు

## మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్ న్యూస్: సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం సత్తెనపల్లిలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. చంద్రబాబు నాయుడుని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న ఈ జగన్ రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఓ చెంపపెట్టు. అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైంది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యాలకు ఇప్పటికైన జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలి. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని కన్నా లక్ష్మీనారాయణ దుయ్యబట్టారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సరే రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను రా.. కదలిరా.. ద్వారా చంద్రబాబునాయుడు ఎత్తి చూపించారు. చంద్రబాబు నాయుడు సభలకు హాజరైన ప్రజానికాన్ని చూస్తే... తెలుగు దేశం పార్టీకి ప్రజల మద్దతు ఎలా ఉందో తెలుస్తుందన్నారు. జగన్ రెడ్డి తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారు. ఒకప్పుడు 'వై నాట్ 175' అనే వ్యక్తి ఇటీవల ఇండియా టుడే ఇంటర్వ్యూలో ఓడిపోయిన తప్పు లేదని అన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నారు. పార్టీలో జగన్ తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను పావులుగా వాడుకుంటు న్నారు. పార్టీ మీద, వైసీపీ నాయకులు మీద వ్యతిరేకత ఉందనే కారణంతో వారిని ఒక సీటు నుంచి మరో సీటుకు మార్చుతున్నారు. తనకు కేటాయించిన తిరుపతి పార్లమెంటును సత్యవేడు ప్రస్తుత వైస్సార్సీపీ ఎమ్మెల్యే, కోనేటి ఆదిమూలం తిరస్కరించారు. నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీలో బీసీలకు అన్యాయం జరగతుందని కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ రాజీనామా చేశారు. జగన్ రెడ్డి మీద వ్యతిరేఖతో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణ రెడ్డి రాజీనామా చేశారని ఆయనన్నారు.

# కమిషనర్ రమణబాబు సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే పిన్నెల్లి



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్: మాచర్ల మున్సిపాలిటీకి కమిషనర్ రమణబాబు చేసిన సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కమిషనర్ రమణబాబు బదిలీపై బుచ్చిరెడ్డిపాలెం వెళ్తున్న సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై రమణబాబును అభినందించి మాట్లాడారు. రమణబాబు మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే మున్సిపాలిటీని తనదైన రీతిలో అభివృద్ధి పథంలో నడిపించారని, రమణబాబు సమయంలో మాచర్ల మున్సిపాలిటీకి అవార్డులు రివార్డులు రావడం ఆయనకు పని పట్ల ఉన్న శ్రద్ధను తెలియజేశాయని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ తన పట్ల ఇంతటి ఆదరాభిమానాలను చూపిన మాచర్ల ప్రజలకు రుణపడి ఉంటానని, మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి ప్రభుత్వ విప్ మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్ ఆర్సిపి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకట రామిరెడ్డిల తోడ్పాటు సహకారం మరువలేనిదని అన్నారు. అంతకుముందు ముందుగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. కమీషనర్‌ను అభినందించి సన్మానించిన వారిలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, వైస్‌చైర్మన్ పోలూరు నరసింహారావు, వార్డు కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, గట్ల అరుణ కోటిరెడ్డి, మేకపోతుల రామాంజిరెడ్డి తదితర కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పలువురు ఉన్నారు.

# ఫోన్ చేయండి-సమస్య పరిష్కరించుకోండి

## డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన



నరసరావుపేట మేజర్‌న్యూస్ పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ ఓటర్ల సమస్యలు పరిష్కరించడానికి వినూత్నంగా చేపట్టిన డైలీ యువర్ కలెక్టర్ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది. ప్రతి బుధవారం పల్నాడు జిల్లాలో నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం గం 10 ల నుంచి గం 11 ల వరకు ప్రతి బుధవారం జరిగే ఈ కార్యక్రమం యధావిధిగా జరిగింది.

ఓటర్ల లిస్టులో ఉన్న తప్పులు, మార్పులు చేర్పులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ పడిగాపులు కాయకుండా ఒక్క ఫోన్ కాల్‌తో తమ సమస్యను పరిష్కరించుకోవచ్చు. కార్యక్రమంలో సుధూర ప్రాంతాల నుంచి ఓటర్లుగా నమోదు, తొలగింపు, బదిలీలకు సంబంధించి సుమారు 18 మంది డ యల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఫోన్ చేసి వారి సమస్యలను జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎన్నికలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

## నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్‌ను

# ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్



పిడుగురాళ్ల రూరల్ మేజర్‌న్యూస్ పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో నేటి దినపత్రిక సూర్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు, సూర్య జిల్లా ఇంఛార్జి యరగాని యేసుబాబు, రిపోర్టర్లు వడ్లమూడి శ్రీనివాసరావు, అనంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



నరసరావుపేట మేజర్‌న్యూస్ ఉపాధ్యాయుల సంఘం యుటిఎఫ్ నూతన భవన నిర్మాణానికి బుధవారం జిల్లా కలెక్టర్ శివ శంకర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. కలెక్టర్ శివ శంకర్ చొరవతో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి ఐదు సెంట్లు భూమిని కేటాయించారు. అందులో శంకుస్థాపన చేశారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం చేపట్టిన "నేటి దినపత్రిక సూర్య" అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించగలరు.

చిలకలూరిపేట రూరల్, నాదెండ్ల, నరసరావుపేట రూరల్, నరసరావుపేట క్రైం, బెల్లంకొండ, ముప్పాళ్ళ, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, రొంపిచర్ల, నకరికల్లు

బి.నరసింహారావు, బ్యూరో ఇన్‌చార్జి
సెల్ : 98499 96624